క్లుప్తంగా

నేడు బీజేపీ ప్రవాస్ యోజన

రాయదుర్గం: బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రవాస్‌యోజనలో భాగంగా శుక్రవారం గౌలిదొడ్డిలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో కార్యక్రమం నిర్వహిస్తామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తెలిపారు. గచ్చిబౌలి డివిజన్, భారతినగర్ డివిజన్ల సమావేశాన్ని ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేశామని ఈ కార్యక్రమానికి కర్నాటక రాష్ట్ర మాజీ మంత్రి మునిరత్నంనాయుడు, బీజేపీ శేరిలింగంపల్లి అసెంబ్లీ కన్వీనర్ రాఘవేందర్ రావు, ప్రవాస్‌యోజన ఇన్‌చార్జీ రవికుమార్ యాదవ్ విచ్చేస్తారని చెప్పారు. ఈ సమావేశంలో ఆయా డివిజన్ల కార్యవర్గ శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులు, వివిధ మోర్చాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొనాలని ఆయన కోరారు.

సంతోషిమాతకు ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని సంతోషిమాత ఆలయంలో గురువారం అమ్మవారి జన్మదినోత్సవం సందర్భంగా ఆలయంలో ఉదయం 4 గంటల నుండి ప్రత్యేక పూజలు నిర్వహించిన్నట్లు ఆలయ అర్చకులు సంతోష్ మహారాజ్ దత్త మహారాజు తెలిపారు. ఉదయం నుండి ప్రత్యేక పూజలు, హోమం, వ్రతాలు చేశామన్నారు. అమ్మవారి దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆలయం పరిసరాలు రద్దీగా కనిపించాయి.

గొర్రెల పంపిణీ

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వం అందిస్తున్న గొర్రెల పంపిణీ పథకాన్ని గొర్ల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని పటాన్‌చెరు మండలం పశువైద్యాధికారి శైలేంద్ర జస్వాల్ అన్నారు. గురువారం పెద్ద కంజర్ల గ్రామంలో గొర్రెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్ద కంజర్ల గ్రామ సర్పంచ్ రాజు, ఉప సర్పంచ్ హరిశంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

ఆల్విన్‌కాలనీ: ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ బస్తీ అధ్యక్షుడు చంద్రారెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 2 ,3 తేదీల్లో ప్రభుత్వం కల్పించిన ఓటరు నమోదు, చిరునామాలో మార్పులు, చేర్పులు చేసుకోవాలన్నారు. పాపిరెడ్డినగర్‌లోని రోడ్డు నంబర్ 2లోని రెయిన్‌బో పాఠశాల, 19 రోడ్డులోని రాజధాని పాఠశాలలో రెండు రోజుల పాటు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఎన్నికల్లో ఓటు వేసేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న యోగానంద్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: గ్యాస్ సిలిండర్ ధర తగ్గించడంపై ప్రధానమంత్రి మోదీ చిత్రపటానికి గురువారం బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. పాదయాత్రలో భాగంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గజ్జెల యోగానంద్ వివేకానందనగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ పాలనలో దేశం సుభిక్షంగా ఉందని, కానీ తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధిలో విఫలమైందని తెలిపారు. తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, కంటెస్టెడ్ కార్పొరేటర్ విద్యా కల్పన, రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు ఏకాంత్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

తెల్లాపూర్‌లో చోరీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గుర్తు తెలియని దుండగులు ఓ విల్లా తాళం పగలగొట్టి బంగారు ఆభరణాలు ఎత్తుకుపోయిన సంఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెల్లాపూర్‌లో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మైహోం అంకురా విల్లాస్‌లో నివాసముండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మనీష్ సింహా ఈనెల 28వ తేదీన ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. కాగా గురువారం ఉదయం ఇంటి పక్క వారు ఫోన్ చేసి తలుపులు తెరిచి ఉన్నాయని మనీష్‌సింహాకు సమాచారం అందించారు. దాంతో బాధితుడు వచ్చి పరిశీలించగా 8 తులాల బంగారు ఆభరణాలు చోరీ అయినట్టు గుర్తించారు.కాగా దుండగులు విల్లాస్ ప్రహరీ గోడపై ఉన్న సోలార్ ఫెన్సింగ్ కట్ చేసి వచ్చి దొంగతనం చేశారని పోలీసులు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రాయదుర్గంలో సోదరుడికి రాఖీ కదుతున్న మహిళ



నానక్‌రాంగూడలో..



రాయదుర్గంలో..

ఘనంగా రక్షాబంధన్

గచ్చిబౌలి/రాయదుర్గం: అన్నాచెల్లెళ్ళ అనుబంధానికి ప్రతీకగా నిలిచే 'రాఖీ' పండగను ఘనంగా చేసుకున్నారు. గురువారం రక్షాబంధన్‌ను పురస్కరించుకుని మహిళలు తమ సోదరులకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి వేడుకలు చేసుకున్నారు .శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీలలో రక్షాబంధన్‌ను ఆనందోత్సవాల నడుమ చేసుకున్నారు.

పటాన్‌చెరు: పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో గురువారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు, పట్టణాలకు చెందిన మహిళా ప్రజాప్రతినిధులు, మహిళలు ఎమ్మెల్యే జీఎంఆర్‌కు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్‌సీ పురం కార్పొరేటర్ పుష్ప నగేష్ డివిజన్ మహిళలతో కలిసి ఎమ్మెల్యే జీఎంఆర్‌కు రాఖీ కట్టారు.



శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీకి రాఖీ కదుతున్న బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు



గచ్చిబౌలిలోని ఏసీపీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావుకు రాఖీ కదుతున్న బ్రహ్మకుమారీస్



ఎమ్మెల్యే గాంధీకి రాఖీ కట్టిన చందానగర్ కార్పొరేటర్ మంజులారఘునాథ్‌రెడ్డి



గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ సాయిబాబాకు రాఖీ కట్టిన మాజీ వార్డు కమిటీ సభ్యురాలు అంజమ్మ



బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్‌కు రాఖీ కదుతున్న మాజీ కార్పొరేటర్ సవతారెడ్డి

ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగస్వాములవ్వాలి



మొక్క నాటుతున్న ప్రొ.వనజ

రాయదుర్గం: సమ్మిళిత విద్య ప్రతి విద్యార్థికి విలువనిస్తుందని న్యూఢిల్లీ జామియా మిలియా ఇస్లామియా యూనివర్శిటీ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ సారా బేగం పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్' అనే అంశంపై ఎక్స్‌టెన్షన్ లెక్చర్ కార్యక్రమం, ప్లాంటేషన్ డ్రైవ్‌పై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాంటేషన్ డ్రైవ్‌లో అందరూ భాగస్వాములు అయితేనే అది విజయవంతం అవుతుందన్నారు. స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ డీన్ ప్రొఫెసర్ వనజ మాట్లాడుతూ విద్యలో చేర్చడం యొక్క ఔచిత్యం, తరగతి గదిలో చేర్చడానికి మార్గదర్శకాల ఆవశ్యకత గురించి వివరించారు. ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ షాహీన్ షేక్ ముగింపు ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ అశ్విని, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ అష్రఫ్ నవాజ్, డాక్టర్ వీఎస్ సుమి ప్రసంగించారు.

'మేరీ మాటీ మేరా దేశ్'లో ప్లాంటేషన్ డ్రైవ్

ఉర్దూ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో 'మేరీ మాటీ మేరా దేశ్'లో ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఎం వనజ మొక్కను నాటారు. ప్రొఫెసర్లు షాహీన్ షేక్, సిద్దిఖీ మహ్మద్, మహ్మద్ మోషాహిద్, వికరఉన్నీసా, డాక్టర్ అశ్వని, ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు.

అభినందన.. రివార్డు

గచ్చిబౌలి: మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించే ఏఆర్ పీసీ జి రాజయ్యను గురువారం సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర అభినందించారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో రాజయ్యకు సీపీ రివార్డును అందించారు. పీసీ రాజయ్య దుర్గం చెరువు కేబుల్‌బ్రిడ్జిపై టాస్క్‌ఫోర్స్/టీటీఎఫ్‌లో విధులు నిర్వర్తిస్తుంటారు. కేబుల్ బ్రిడ్జిపై అనుమానాస్పదంగా తిరుగుతూ ఉండేవారిని విచారించి వారిని మాదాపూర్ లా అండ్ ఆర్డర్ పోలీసులకు అప్పగించేవాడు. వారికి కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించేవారు. ఈ మేరకు రాజయ్యను సీపీ అందించారు.



సీపీ చేతుల మీదుగా రివార్డు అందుకుంటున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ రాజయ్య



కుంకుమార్చన చేస్తున్న మహిళలు

వైభవంగా కుంకుమార్చన

హఫీజ్‌పేట్: చందానగర్‌లోని విశాఖ శ్రీ శారదా పీఠపాలిత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ సముదాయంలో గురువారం శ్రావణ పూర్ణిమ సందర్భంగా శ్రీమహాలక్ష్మీ సహస్రనామ స్తోత్ర పారాయణం, అఖండ కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. భవాని అమ్మవారికి ఆలయ నిర్మాణదాత ఆలయ ఉపాధ్యక్షులు తోట సుబ్బారాయుడు పంచామృత అభిషేకం, విశేష పుష్పాలంకారం, లక్ష కుంకుమార్చన జరిపించారు. కార్యక్రమాలలో దేవాలయ కార్యవర్గ సభ్యులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

బొల్లారంలో కార్డన్ సెర్చ్

24 వాహనాలు సీజ్



కాలనీలో సెర్చ్ చేస్తున్న పోలీసులు

జిన్నారం(పటాన్‌చెరు): అనుమానితులు, కొత్త వ్యక్తులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పటాన్‌చెరు డీఎస్పీ పురుషోత్తంరెడ్డి సూచించారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో గల లక్ష్మీనగర్‌లో కాలనీలో గురువారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. కాలనీలో ప్రతి ఇంటికి తిరుగుతూ అనుమానితులను విచారించారు. అనుమానం ఉన్న 20మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో 24 బైక్‌లను సీజ్ చేశారు. అనంతరం డీఎస్పీ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ లక్ష్మీనగర్ కాలనీలో ఆధార్ కార్డులు సరిగా లేని 20మందితో పాటు మరో 24 బైక్‌లను కూడా సీజ్ చేశామన్నారు. కొత్త వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫోన్లకు వచ్చిన అనవసర మెసేజ్‌లకు స్పందించొద్దన్నారు. సీఐలు నయూముద్దీన్, లాలూ నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్‌లతో పాటు ఐదుగురు ఎస్ఐలు, 70మంది పోలీసులు పాల్గొన్నారు.

నేటి నుంచి బీజేపీ మట్టి సేకరణ

గ్రామం నుంచి అమృత్ కలశ్ యాత్ర

కూకట్‌పల్లి: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలో పవిత్ర అమృత వాటికను నిర్మించడానికి దేశంలో ప్రతి గ్రామం నుంచి మట్టి సేకరణకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు ఇచ్చిన విషయం తెలిసిందే. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్‌ప్రకాష్ నడ్డా ఆదేశాల మేరకు 'నా భూమి - నాదేశం'అనే నినాదంతో సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ 30వ తేదీ వరకు గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పలు కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. కాసం వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు.

- ఈ కార్యక్రమాల్లో అన్ని సామాజిక వర్గాల ప్రముఖులు, యువతను కలుపుకొని సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు దేశ భక్తి కార్యక్రమం నిర్వహించాలన్నారు. జాతీయ పతాకం తప్ప పార్టీ పతాకాలు, కండువాలు వాడొద్దని తెలిపారు. కాషాయ కండువాలు ధరించవచ్చన్నారు. మట్టి లేదా బియ్యం ఇవ్వడానికి నిరాకరించిన వారిని బలవంత పెట్టొద్దని సూచించారు. ఇది పూర్తిగా దేశభక్తి కార్యక్రమం అని తెలిపారు.
- స్వాతంత్ర్య సమరయోధుల ఇళ్ల నుంచి.. తెలంగాణ విమోచన కోసం పోరాడి అమరవీరుల ఇళ్ల నుంచి.. కేంద్ర, రాష్ట్ర భద్రతా దళాల ఇళ్ల నుంచి తప్పని సరిగా మట్టి, బియ్యపు గింజలను సేకరించాలి. ఈ కార్యక్రమాన్ని గ్రామంలోని బొడ్రాయి లేదా గుడి నుంచి ప్రారంభించాలి. అదే విధంగా అనువైన ప్రదేశంలో 75 మొక్కలు నాటాలన్నారు. మట్టి సేకరణ పూర్తయిన తరువాత అమృత కలశాన్ని మండల కేంద్రానికి తరలించేంత వరకు ఒక పవిత్ర స్థలంలో భద్రపర్చాలని తెలిపారు. ప్రతి మండలానికి ఒక కలశ్ ప్రముఖ్‌ని నియమించాలని సూచించారు.

హ్యాండ్లూమ్ మేళా ప్రారంభం

మోతీనగర్: మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో సెప్టెంబర్ 1 నుంచి దసరా పండగ వరకు ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్స్ మేళాను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు అక్బర్‌అలీ, తాయర్ ఆలీ, గంగాధర్‌లో తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో తయారు చేసిన ఖాదీ వస్త్రాలతో పాటు వివిధ రకాల చీరలు, గృహోపకరణాలు, వన్‌గ్రామ్ గోల్డ్ అందుబాటులో ఉన్నాయి. రోజూ ఉదయం 10.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు మేళా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ మేళాను శుక్రవారం ఉదయం 10 గంటలకు మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

పనులన్నీ సత్వరమే పూర్తి చేయాలి:

- ఎమ్మెల్యే మాగంటి

వెంగళరావునగర్: నియోజకవర్గాన్ని నగరంలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ ఎల్ఎన్ నగర్, యూసుఫ్‌గూడ బస్తీ, వెంకటగిరి ప్రాంతాల్లో ఆయన గురువారం పాదయాత్ర చేశారు. ఆయా ప్రాంతాల్లో రూ. 74 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ, మంచి నీటి పైప్‌లైన్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పనులన్నీ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంతోష్, నర్సింగ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు

నేడు హెచ్ఐసీసీలో స్వతంత్ర్య భారత వజ్రోత్సవాల ముగింపు వేడుకలు

రాయదుర్గం: భారత స్వతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు వేడుకల సందర్భంగా మాదాపూర్‌లోని హెచ్ఐసీసీ ప్రాంతంలో శుక్రవారం సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ నేపథ్యంలో ఆయా మార్గాలలో ట్రాఫిక్ సమస్యల నివారణకు చర్యలు తీసుకున్నారు.

ఆంక్షలు అమలయ్యే సమయాలు..
ఉదయం 7 గంటల నుంచి..
సాయంత్రం 6 గంటల వరకు..

- నీరూస్ జంక్షన్-సైబర్‌టవర్స్ జంక్షన్, మెటల్ చార్మినార్ జంక్షన్, గూగుట్(సీఐఐ) జంక్షన్, కొత్తగూడ జంక్షన్ రోడ్డు
- మెటల్ చార్మినార్ జంక్షన్, ఖానామెట్ జంక్షన్, హైటెక్స్/హెచ్ఐసీసీ/న్యాక్‌రోడ్డు
- జేఎన్‌టీయూ-సైబర్ టవర్స్, బయోడైవర్శిటీ జంక్షన్
- గచ్చిబౌలి జంక్షన్, బొటానికల్ గార్డెన్ జంక్షన్, కొత్తగూడ జంక్షన్, కొండాపూర్ జంక్షన్

ప్రత్యామ్నాయ మార్గాలు.......

- ట్రాఫిక్ నీరూస్ నుంచి గచ్చిబౌలి జంక్షన్ వైపు ట్రాఫిక్‌ను సీఓడీ (అయ్యప్ప సొసైటీ మాదాపూర్) వద్ద మళ్ళించబడుతుంది.
- దుర్గంచెరువు వైపు-ఇనార్బిట్-ఐటీసీ కోహినూర్-ఐకియా బయోడైవర్శిటీ గచ్చిబౌలి, సైబర్ టవర్స్ జంక్షన్‌ను నివారించాలి
- మియాపూర్, కొత్తగూడ, హఫీజ్‌పేట్ ప్రాంతాల నుంచి హైటెక్‌సిటీ వైపు ట్రాఫిక్ సైబర్‌టవర్స్-జూబ్లీహిల్స్ రోలింగ్ హిల్స్, ఏఐజీ ఆస్పత్రి-ఐకియా-ఇనార్బిట్-దుర్గంచెరువు రహదారిని ఉపయోగించవచ్చు. సైబర్ టవర్స్ జంక్షన్‌ను నివారించండి
- ఆర్‌సీపురం, చందానగర్ నుంచి మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల వైపు ట్రాఫిక్ ఉండవచ్చు.
- బీహెచ్ఈఎల్-నల్లగండ్ల-హెచ్‌సీయూ, ట్రిపుల్ ఐటీ గచ్చిబౌలి రోడ్డును వినియోగించాలి. ఆల్విన్, కొండాపూర్‌ను రోడ్డును నివారించాలి.

భారీ వాహనాలపై ఈ రూట్లలో..

- జేఎన్‌టీయూ నుంచి సైబర్ టవర్స్
- మియాపూర్ నుంచి కొత్తగూడ
- కావూరి హిల్స్ నుంచి కొత్తగూడ
- బయోడైవర్శిటీ నుంచి సైబర్‌టవర్స్
- నారాయణమ్మ కాలేజ్ నుంచి గచ్చిబౌలి

ఓటరు నమోదుపై స్పెషల్ క్యాంపెయిన్

కుత్బుల్లాపూర్: రెండో స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా సెప్టెంబర్ 2, 3వ తేదీల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి పులి సైదులు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. మొత్తం 582 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. పారదర్శకంగా ఓటరు జాబితాను తయారు చేసే క్రమంలో అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ముందస్తుగా ఓటు నమోదు చేసుకోవచ్చని సూచించారు.

- ఆగస్టు 21వ తేదీన ఓటరు ముసాయిదా విడుదల చేసిన జాబితాలో పేరు ఉందో.. లేదో అన్న విషయాన్ని పరిశీలించుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో పేరులో ఏదైనా తప్పులు ఉన్నట్లు గుర్తిస్తే వాటిని సవరించుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. నూతన ఓటరు నమోదు దరఖాస్తు-6, ఆధార్ అనుసంధానం దరఖాస్తు-6బీ, ఓటరు జాబితా అభ్యంతరాలు ఓటర్ తొలగింపునకు దరఖాస్తు-7, మార్పులు చేర్పులకు దరఖాస్తు-8లను సెప్టెంబర్ 19వ తేదీ వరకు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

మురికికూపంగా కాయిదమ్మకుంట చెరువు

- అసంపూర్తిగా మురుగునీటి పైప్‌లైన్ పనులు
- పైప్‌లైన్ జంక్షన్ల వద్ద చాంబర్లు నిర్మించాలని ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

హఫీజ్‌పేట్ : కాయిదమ్మకుంట చెరువు మురికికూపంగా తయారైంది. చెరువులు, కుంటల సుందరీకరణ పనులు ప్రత్యేక నిధులతో జీహెచ్ఎంసీ చేపడుతున్నారు. కానీ ఈ చెరువు మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని పలు చెరువుల సుందరీకరణ పనులు దాదాపు పూర్తికావొచ్చినా మరికొన్ని చెరువులను కనీసం పట్టించుకోవడం లేదు. కాయిదమ్మకుంట చెరువు చుట్టుపక్కల కాలనీలు, బహుళ అంతస్తుల భవనాలు ఉన్నాయి. ఇక్కడ ఉన్న మీదికుంట చెరువు నుంచి మురుగు నీరు కలవకుండా ప్రత్యేకంగా కాయిదమ్మకుంట చెరువు చుట్టు పైప్‌లైన్ వేసినప్పటికీ చాంబర్లు నిర్మించలేదు. దీంతో పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. వినాయక చవితి, బతుకమ్మ పండగలు వస్తే చెరువులోని గుర్రపు డెక్క, చెత్త తొలగిస్తారు. తదనంతరం పట్టించుకునేవారుండరని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా చెరువు సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- కాయిదమ్మకుంట చెరువుచుట్టు పైప్‌లైన్లు వేసినా చాంబర్లు నిర్మించకపోవడంతో గేటెడ్ కమ్యూనిటీ వాసులు దుర్గంధంతో సతమతమవుతున్నారు.



చెరువులో పెరుగుతున్న గుర్రపుడెక్క

- చుట్టుపక్కల కాలనీలు భారీగా పెరగడంతో వాటి నుంచి మురుగు నీటిని చెరువులోకి వదిలేస్తున్నారు.
- కుంట పక్కనే స్క్రాప్ దుకాణం వల్ల కూడా చెరువు పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి.
- దోమలు ప్రబలి జ్వరాలతో పాటు కంటి మీద కునుకు ఉండడం లేదని కాలనీలవాసులు వాపోతున్నారు.
- ఇరిగేషన్ అధికారులు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ సూచిక బోర్డు పెట్టాలి
- కట్టపై వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలి



పైప్‌లైన్ల వద్ద చాంబర్ నిర్మించకుండా వదిలేసిన దృశ్యం

- చెరువులో ఉన్న చెత్త చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడానికి చర్యలు తీసుకోవాలి

చాంబర్లు నిర్మించాలి

కాయిదమ్మకుంట చెరువు చుట్టు మురుగునీరు కలవకుండా పైప్‌లైన్ నిర్మించారు, కానీ చాంబర్లు నిర్మించలేదు. దీంతో దుర్వాసన, దుర్గంధం వల్ల తామంతా సతమతం అవుతున్నాం. కుంట పూర్తిగా మురుగు కుంపటిగా మారింది. చెరువులో చెత్త వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. చెరువు సుందరీకరణ త్వరతగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

-అశోక్, హఫీజ్‌పేట్

పట్టించుకోవడం లేదు

మీదికుంట చెరువు నుంచి కాయిదమ్మకుంట వరకు చెరువులో మురుగునీరు కలవకుండా ప్రత్యేక పైప్‌లైన్ నిర్మించారు. కానీ రెండు పైప్‌లైన్లు కలిసే వద్ద చాంబర్లు లేదు. పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన అధికారులు వెంటనే చాంబర్లను నిర్మించాలి.

-జీవన్, సాయికాలనీ

- చెరువు చుట్టు నామమాత్రంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు కానీ నిర్వహణ లేదు. కాయిదమ్మకుంట చెరువు సుందరీకరణ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225455
9912225462